క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఎత్తం నర్సింహకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందిన రూ.23,500 చెక్కును ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కల్వరాల సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, గోపల్‌దిన్నె సర్పంచ్ విజయ్‌కుమార్ శుక్రవారం అందజేశారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో చెక్కు మంజూరయినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మౌలాన్‌బీ, సింగిల్ విండో డైరెక్టర్ సూర్యనారాయణ, సాయిబాబ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ప్రయోజనాలు



అమరచింత: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈమేరకు అంగన్‌వాడీ టీచర్లు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి చిరుధాన్యాలను ప్రదర్శించారు. ఏప్రిల్ 20 నుంచి మే 3 వరకు మిల్లెట్స్‌పై అవగాహన కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని 1వ, 4వ, 5వ, 6వ, 8వ, 9వ, అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులతో కలిసి కార్యక్రమం నిర్వహించామని టీచర్లు వజ్రమ్మ, రాధిక, బాలేశ్వరి, వెంకటేశ్వరమ్మ, శశికళ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో క్షయ వ్యాధి నిర్మూలనపై మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్రగౌడ్ శుక్రవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది క్షయ బారిన పడుతున్నారన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం యశోద, పాఠశాల ఉపాధ్యాయులు అహ్మద్, కృష్ణ, ఆశా కార్యకర్తలు జ్యోతి, మౌలానాబీ పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



వనపర్తి టౌన్: పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో రాష్ట్రంలోని నిరుద్యోగులు అయోమయ స్థితిలో ఉన్నారని, ఇందుకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెన్నరాములు అన్నారు. పేపర్ లీకేజీలకు కారణమైన నిందితులతో పాటు టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారికి అందజేసి, జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష ప్రారంభించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వనపర్తి క్రైం: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అగుపోగు కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, ఉపాధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పరశురాం, అధికార ప్రతినిధి పెద్దిరాజు, నాయకులు కొమ్ముసామేల్, దేవేందర్, బాబురావు, నారాయణ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు పుర కమిషనర్‌గా ఆదిశేషు



పెబ్బేరు: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో నూతన కమిషనర్‌గా ఆదిశేషు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలో పన్ను వసూలు, పారిశుద్ధ్యం, శానిటేషన్, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.



పెద్దమందడిలో..



అమరచింతలో..



గోపాల్‌పేటలో..

అభివృద్ధిలో పోటీతత్వం అవసరం

కొత్తకోట రూరల్: గ్రామాల అభివృద్ధే ఎజెండాగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని కలెక్టర్ తేజస్‌నందులాల్, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చొరువ చూపిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేఘారెడ్డి, ఎంపీడీఓ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: ఉమ్మడి మండలాల్లో శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అవార్డులను అందించారు. అమరచింత ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి, జెడ్పీటీసీ మార్క సరోజ ఆధ్వర్యంలో.. ఆత్మకూర్‌లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు సమక్షంలో ఎమ్మెల్యే అవార్డులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. సంపూర్ణ పారిశుద్ధ్యం గల గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో పాటుగా నాయకులు, మహిళలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేసినప్పుడే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయని జెడ్పీసీఈఓ శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మరుగుదొడ్ల నిర్మాణం, ఉపయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటుగా మండల స్థాయి దీన్‌దయాల్ పంచాయతీ పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, ఎంపీడీఓ విజయ్‌మార్, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో అవార్డులు అందుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ, జెడ్పీటీసీ

పాన్‌గల్: గ్రామాలభివృద్ధిలో పార్టీలకతీతంగా పోటీ పడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన నిరంతర అభివృద్ధి పంచాయత్ పురస్కార్ దీన్ దయాల్ అవార్డుల ప్రదానోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 17 పంచాయతీలకు అవార్డులు లభించాయి. పేదరిక నిర్మూలన, ఆరోగ్యవంతమైన గ్రామం, తాగునీటి లభ్యత, సుస్థిర మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, సుపరిపాలన అంశాల ఆధారంగా అవార్డులు లభించాయి. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ సత్తయ్య పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల స్థాయి దీన్‌దయాల్ ఉపాధ్యాయ నిరంతర అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా శుక్రవారం రేవల్లిలో ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సెక్రెటరీలు, పంచాయతీ కార్మికులకు అవార్డులు ప్రదానం చేశారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసినందుకు గాను అవార్డులకు ఎన్నికైనట్లు ఎంపీపీ సేనాపతి తెలిపారు. అలాగే గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అభివృద్ధికి తోడ్పాటు అందించిన మండల అధికారులకు అవార్డులు అందించారు.

మదనాపురం: మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు 9 అంశాలలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ అవార్డులు లభించాయి. దీంతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించి షీల్డ్‌లను అందించారు.

వీపనగండ్ల: సమన్వయంతో పనిచేస్తూ మౌలిక వసతుల ఏర్పాట్లపై అత్యుత్తమ ఫలితాలను సాధించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కార్ అవార్డులను అందజేశారు. మొత్తం మండలంలోని 14 మంది సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఈ అవార్డులను అందజేసినట్లు ఎంపీడీఓ కతలప్ప అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ బద్రినాథ్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు మౌలాన్‌బీ తదితరులు ఉన్నారు.

చిన్నంబావి: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవినారాయణ అధ్యక్షతన పంచాయతీ పురస్కార్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మ పాల్గొని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు అందజేసి, సన్మానించారు.



వీపనగండ్లలో..



రేవల్లిలో..



మదనాపురంలో..



ఖిల్లాఘనపురంలో..

ఆలయ నిర్మాణానికి సహకారం

అమరచింత: మండలంలోని చంద్రప్పతండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంలో తమ వంతు సహకారం అందిస్తామని నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి తెలిపారు. తండాలో శుక్రవారం నూతన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం తండాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు, నాగునాయక్, బద్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ పోగ్రాం 2023–24 బడ్జెట్ అంచనాలపై సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. మండలానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ 12.79లక్షలు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ రమేష్‌నాయుడు సమావేశంలో సభ్యులకు వివరించారు. వీటిని గ్రామాల్లో తాగునీటి పైపులైన్, మురుగు కాల్వల నిర్మాణం, 40 శాతం నిధులతో సిమెంట్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం కోసం సభ్యుల ఆమోదంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. అనంతరం మండలస్థాయి సాహశక్తి పంచాయతీ స్వతంత్ర వికాస్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తొమ్మిది విభాగాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ అబ్రహంలింకన్, వైస్‌ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు వినీలా రాణి, నిర్మల, మంజుల, సత్యంయాదవ్, రాజశేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగన్న, ఎంపీటీసీలు నాగమణి, పార్వతమ్మ, ఎల్లస్వామి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఆరీఫ్, ఎంపీఓ రాజు, పరమేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి: ఆర్‌ఎస్‌ఎస్



పేపర్ బ్యాగ్స్‌తో ప్రచారం చేస్తున్న నాగకృష్ణ

వనపర్తి క్రైం: వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ నాగకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో యువకులకు పేపర్ బ్యాగులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు తెచ్చేందుకు యువత ముందడుగు వేయాలని, మంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరుచుకోవాలని సూచించారు. ముందు తరాల భవిష్యత్ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి.. పేపర్ బ్యాగ్స్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, ప్రజల్లో మార్పు వచ్చేలా తమ వంతు పాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మున్నూర్ రవీందర్, హిందూవాహిని విభాగ్ కన్వీనర్.అభిలాష్, జిల్లా కన్వీనర్ అరుణ్, రఘుసాగర్, రోహిత్, నంద, సాయి తదితరులు ఉన్నారు.

రహదారి ఆక్రమించారని ఆందోళన

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో చిన్న కురుమన్న అనే వ్యక్తి రోడ్డును ఆక్రమించి రహదారిపై మట్టిని కప్పి ఉంచాడంటూ కాలనీకి చెందిన ప్రజలు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని తన ఇంటి స్థలం అంటూ కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారికి సీసీ వేయించాలని డిమాండ్ చేశారు. పలు సందర్భాల్లో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా రహదారిని కబ్జా చేసిన వ్యక్తిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రహదారిపై వేసిన మట్టిని వెంటనే తొలగించాలని, లేని పక్షంలో ప్రతి నిత్యం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ ఆర్ఐ కృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అబ్రహం, శ్యాంసుందర్, భాస్కర్, సాలు, ప్రవీణ్, వినోద్, స్వాతి, పద్మమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేత

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు టీఎస్‌ఆర్‌ఎడీసీఓ కంపెనీ వారు 8 డిజిటల్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేసినట్లు హెచ్‌ఎం, గణిత ఉపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు.కంపెనీ మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ మేనేజర్ ఖలీమ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి

మదనాపురం: నిరు పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పేదలకు ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతూ సీపీఎం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాములు ,వెంకటేష్, చెన్నయ్య, జిరంజీవి, మణివర్ధన్ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిన్నంబావి: మండల కేంద్రంలో కేఎంఆర్ ట్రస్టు చైర్మన్ కొత్త కళ్యాణ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా శుక్రారం చిన్నంబావి మండల వాల్మీకి చౌరస్తాలో కేఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం, అంబలి కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిన్నంబావి గ్రామ సర్పంచ్ రంజిత్‌కుమార్, లక్ష్మణ్ గౌడ్, ధర్మేందర్, వెల్టూరు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

అమరచింత: మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ మార్గాలను పెంపొందించుకునేందుకు కౌన్సిలర్లు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆత్మకూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.1.73కోట్లు మంజూరు అయ్యాయన్నారు. వీటితో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు, ఇతర ఆదాయ వనరుల కోసం వెచ్చించాలన్నారు. అదే విధంగా మున్సిపల్‌కు గ్రాంట్స్ రూపంలో రూ.12 కోట్లు మంజూరయ్యాయని, వీటితో పట్టణంలో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. ఇతర ఖర్చుల కోసం రూ.ఐదు లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రతి నెల మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే కార్యక్రమాలను నిర్వహించి సిబ్బంది వేతనాల కొరత రాకుండా చూడాలన్నారు. కలిసి కట్టుగా ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ రాజకీయలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

27న అయ్యప్ప ఆలయ ప్రాకార ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న అయ్యప్ప కమిటీ సభ్యులు

వనపర్తి క్రైం: పట్టణ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయ మొదటి ప్రాకార ప్రారంభోత్సవం ఈనెల 27న నిర్వహించనున్నట్లు బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ మున్నూర్ రవీందర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి కృష్ణగార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగీరథ చౌరస్తాలో అయ్యప్ప స్వామి ఆలయం మొదటి ప్రాకారం తమ తల్లిదండ్రులు మున్నూర్ లక్ష్మీదేవి, కృష్ణయ్యల జ్ఞాపకార్థం ఆలయానికి సమర్పణ చేయనున్నట్లు తెలిపారు. 27న ఉదయం 7గంటలకు పూర్ణకుంభంతో అయ్యప్పస్వామి ఆలయం నుంచి ప్రాకారం వరకు వచ్చి, 9గంటలకు ప్రాకారం వద్ద యజ్ఞం, తదుపరి జ్యోతి ప్రజ్వలన ప్రారంభం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలను మార్గదర్శనం చేయడానికి శ్రీస్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, బ్రహ్మవిద్య కుటీర ఉత్తరకాశీ, విశ్వహిందూ పరిషత్ సహాయ కార్యదర్శి సత్యం హాజరవుతున్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి ముత్తుకృష్ణ, సిద్ధాంతి రమేష్‌శర్మ, పాపిరెడ్డి, బండారు కుమారస్వామి, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, చిత్తరి ప్రభాకర్, పరశురాం, పెద్దిరాజు, బచ్చురాం, కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’పై అవగాహన కల్పించాలి



దొండాయిపల్లిలో కంటివెలుగు శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కొత్తకోట రూరల్: అంధత్వ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సూచించారు. పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం ప్రతిరోజూ అందేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ అనంతమ్మ, ఎంపీటీసీ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు

మండల స్థాయి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ నిరంతర అభివృద్ధి పంచాయతీ రాజ్ పురస్కార్ ప్రదానోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్వాల, మంగంపల్లి, అమ్మపల్లి, మోజర్ల, పామిరెడ్డిపల్లి, అనకాయపల్లితండా, ముందరితండా సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి అవార్డులుఅందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీడీఓ అఫ్జల్, వైస్‌ఎంపీపీ రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాటిపాములలో..

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి, తెల్లరాళ్లపల్లితండా, రేమద్దుల గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగును పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

103 మందికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగులో 103 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో నలుగ్గురికి అద్దాలను పంపిణీ చేశామని, ఐదుగురికి అద్దాల తయారీకి పంపించామన్నారు. ముగ్గురిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్‌ఎం , ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్.. యమ డేంజర్



ఆత్మకూర్ భారత్ హోటల్ సమీపంలో ప్రమాదకరంగా డివైడర్ గుంతలు

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలో నిర్మిస్తున్న డివైడర్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు నెలల కిందట రహదారిని తవ్విన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు డివైడర్ నిర్మాణ పనులు అలాగే వదిలేశాడు. ద్విచక్ర వాహనదారులు డివైడర్ కోసం తవ్విన గుంతల్లో అదుపు తప్పి పడడంతో గాయాల పాలవుతున్నారు. పట్టణంలో 1.5 కిలోమీటర్ మేర డివైడర్ నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ కోసం రూ.కోటిన్నర ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న హైదారబాద్‌కు చెందిన వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్ పనుల పురోగతిని పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడనకన కొనసాగుతున్నాయి. దీంతో రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈవ్యవహారంలో మున్సిపల్ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఇద్దరు మేస్త్రీలు మారారని, ప్రస్తుతం కొత్తగా మేస్త్రీలతో పనులు చేపడుతున్నామన్నారు. పనుల్లో వేగం పెంచి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



గాంధీచౌక్ సమీపంలో..